సాక్షి వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 1 । జనవరి । 2025

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



జిల్లా ప్రజలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. -పులివెందుల రూరల్

కలెక్టర్ శ్రీధర్‌కి పదోన్నతి



కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇప్పటివరకు కలెక్టర్‌గా ఉన్న ఆయనకు కార్యదర్శి హోదాను ఇచ్చారు. పదోన్నతి ఇచ్చినప్పటికీ కలెక్టర్‌గానే జిల్లాలో కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. -కడప సెవెన్‌రోడ్స్

గరిష్టం/కనిష్టం
30.8/18.0

వాతావరణం

జిల్లాలో మంగళవారం 18.0 - 30.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

3 నుంచి ఉరుసు



మాచుపల్లె గ్రామ సమీపంలోని హజరత్ సయ్యద్ షావలి దర్గా

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపంలో ఉన్న హజరత్ సయ్యద్ షావలి దర్గాలో ఈ నెల 3వ తేదీ నుంచి ఉరుసు మహోత్సవం జరగనుంది. ఈ విషయాన్ని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మాచుపల్లె గ్రామ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ షావలి దర్గా పురాతనమైందని తెలిపారు. జనవరి 3న రాత్రి 9 గంటలకు గంధం మహోత్సవాన్ని పూల చాందినీలో ఊరేగిస్తారన్నారు. తర్వాత ఫాతేహా నిర్వహిస్తారన్నారు. 4న రాత్రి ఉరుసు జరుగుతుందని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. రాత్రి బెంగళూరుకు చెందిన జమీర్ షహ్‌జాదా, హైదరాబాద్‌కు చెందిన రబియాతాజ్ బృందాల మధ్య ఖవ్వాలి పోటీ ఉంటుందని తెలిపారు. 5న ఉదయం తహలీల్ ఫాతేహా జరుగుతుందన్నారు. అందరూ ఉరుసు మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ కోరారు.

వైన్‌షాపులు, బార్లకు అర్ధరాత్రి వరకు అనుమతి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని మద్యం, బార్ల దుకాణాల సమయాన్ని పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండ్ రవికుమార్ తెలిపారు. మద్యం దుకాణాలు రాత్రి 12 గంటల వరకు ... బార్లు 1 వరకు ఉంటాయని పేర్కొన్నారు.

మీడియా అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

కడప సెవెన్‌రోడ్స్: మీడియా అక్రిడిటేషన్ల గడువు పొడిగిస్తూ సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024 డిసెంబరు 31వ తేది వరకు అక్రిడిటేషన్ కలిగిన విలేకరులకు 2025 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేది వరకు అక్రిడిటేషన్ వ్యాలిడిటీని పొడిగించారని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు, అలాగే తొలగించిన జర్నలిస్టుల వివరాలను వీలైనంత త్వరగా తమ కార్యాలయానికి పంపాలని బ్యూరో ఇన్‌ఛార్జిలను కోరారు.

సచివాలయ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

కడప సెవెన్‌రోడ్స్: పెన్షన్ల పంపిణీలో ఒక్కో లబ్ధిదారుడి వద్ద రూ. 300–500 వరకు వసూలు చేస్తున్న జమ్మలమడుగు నగర పంచాయతీ వార్డు మహిళా సంరక్షణ సచివాలయ ఉద్యోగి ఎం.భారతిబాయిని కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెరిఫికేషన్‌లో పెన్షన్ తొలగిస్తారంటూ లబ్ధిదారులను భయపెడుతూ ఆమె డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రైవింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



అడ్మిషన్ పొందిన అభ్యర్థులతో డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు ద్వారా అందిస్తున్న శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు సూచించారు. కడప డిపోకు సంబంధించి శిక్షణ పొందేందుకు హాజరైన 23వ బ్యాచ్ అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్‌శిక్షణలో ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలుకు విశేష గుర్తింపు ఉందన్నారు. సుదీర్ఘ అనుభవం కలిగిన నిపుణులైన ట్రైనర్‌చే శిక్షణ ఇస్తామన్నారు. అంతేకాకుండా వాహనాల విడిభాగాలకు సంబంధించి కూడా శిక్షణలో సమగ్రంగా తెలియజేస్తామని వివరించారు. భవిష్యత్తులో ఆర్టీసీలో ఏర్పడే ఖాళీల భర్తీలో కూడా కొంతమేర ప్రాధాన్యత ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఏకాగ్రతతో పూర్తి స్థాయిలో శిక్షణలో చెప్పిన అంశాలన్నీ గుర్తించుకోవాలని సూచించారు. ట్రైనర్‌తోపాటు పలువురు ఆర్టీసీ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

హ్యాపీ న్యూ ఇయర్ 2025 NEW YEAR

- వెల్లువెత్తిన కొత్త సంవత్సర సంబరాలు
- శుభాకాంక్షల కోలాహలం
- యువత హల్‌చల్



కడప రిమ్స్ వద్ద న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో వైద్యులు

కడప కల్చరల్: టిక్..టిక్.. టిక్... కౌంట్‌డౌన్ మొదలైంది.. అందరి దృష్టి ఆ 'టైం' పైనే ఉంది.. క్షణక్షణం ఉద్వేగం... అంతటా ఆతృత... తెలియని ఉత్కంఠ... మంగళవారం అర్ధరాత్రి జనాల పరిస్థితి ఇది. 11.57...11.58...11.59.... అంతే.. ఎదురు చూసిన క్షణం రానేవచ్చింది.. ఒక్కసారిగా 'హ్యాపీ న్యూ ఇయర్' అనే శబ్దం హోరెత్తిపోయింది. పాత సంవత్సరం క్యాలెండర్ చివరి పేజీ ఎగిరిపోయింది. 2025 క్యాలెండర్ తొలి పేజీ దర్శనమిచ్చింది. రాత్రి సరిగ్గా 12.00 గంటలు కడప నగరంలో యువత కేరింతలు కొట్టారు.. పలు సర్కిళ్లలో సందడి చేశారు. కొందరు యువకులు రోడ్లపైకొచ్చి ఒకరినొకరు హత్తుకుని 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇంకొందరు కేరింతలతో బైకులపై విన్యాసాలు చేస్తూ వీధుల్లో కలియతిరిగారు. కనిపించిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు 30యాక్టు అమలు చేయడం, డ్రంక్ అండ్ డ్రైవ్ బందోబస్తు, ఆంక్షలు ఎక్కువగా ఉండడంతో యువత జోష్ ఈసారి కొద్దిమేర తగ్గినట్లు కనిపించింది.



బార్బీ బొమ్మ ఆకారంలో కేకు

సందడే సందడి

కడప నగరంలో మంగళవారం అర్ధరాత్రి నూతన సంవత్సరం సంబరాలు అంబరాన్ని అంటాయి. కొందరు ఉత్సాహంగా టపాసులు కాల్చి సంబరపడ్డారు. మరికొందరు కేకులు కట్ చేశారు.. అలాగే ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు. బంధుమిత్రులకు అర్ధరాత్రి ఫోన్లలో శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రోడ్ల కూడళ్లను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. వీధుల్లో అర్ధరాత్రి పగలును తలపించే సందడి ఏర్పడింది. దాదాపు అన్ని చర్చిలలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల పాస్టర్లు, ఇతర పెద్దలు నూతన సంవత్సర ఆధ్యాత్మిక సందేశం, ఆశీస్సులు అందజేశారు. కాగా.. సాయంత్రం 4 గంటల నుంచి జిల్లా అంతటా ప్రధాన మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి. కేకులు, స్వీట్లు, దుస్తులు, బహుమతులు, పూలు, పండ్లు కొనేవారితో రద్దీగా మారాయి. ఆయా వస్తువుల ధరలు పెరిగినా కొనుగోళ్లు మాత్రం తగ్గలేదు.



వైవీ స్ట్రీట్‌లో జనాల రద్దీ



కడప సీఎస్ఐ చర్చిలో సందేశం ఇస్తున్న గురువులు



ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షలు



లాంగ్‌జంప్ చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థి

కడప అర్బన్: పోలీసు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు సంబంధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డి.టి.సి)లో దేహదారుఢ్య పరీక్షలు రెండవ రోజు మంగళవారం పకడ్బందీగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు సోమవారం నుంచి ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. ప్రతి రోజూ అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్‌మెంట్స్ చేస్తారని, తరువాత బయోమెట్రిక్ తీసుకుంటారన్నారు. దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావులేకుండా ఆధునిక ఆర్.ఎఫ్.ఐ.డి కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. డిజిటల్‌గా, పారదర్శకంగా ఈవెంట్స్ నిర్వహిస్తున్నామన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఖచ్చితంగా ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరుకావాలని,నోటిఫికేషన్ వచ్చిన తరువాత జారీ చేసిన లేటెస్ట్ కులధృవీకరణ సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. ఆధార్, స్టేజ్–2, స్టడీ, మార్క్స్ లిస్ట్స్ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సర్టిఫికెట్లు అటెస్ట్ చేసినవి తప్పనిసరిగా తీసుకుని రావాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీకోర్ టీం, డీపీఓ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

వర్చువల్‌గా వైవీయూ పాలకమండలి సమావేశం

వీసీ నామినీ ఏర్పాటుపై తీర్మానం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం మంగళవారం వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఏపీ ఉన్నత విద్యామండలి అధికారులు, ఉన్నతవిద్య ప్రిన్సిపల్ సెక్రటరీ తదితరులు వర్చువల్ విధానంలో హాజరుకాగా, వైవీయూలో పాలకమండలి సభ్యులు ఆచార్య పి. చంద్రమతీశంకర్, మూల మల్లికార్జునరెడ్డి, జె. వెంకటలక్ష్మి, కె. చిన్న సుబ్బారావు, పి. ముబీనాబేగం పాల్గొన్నారు. విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియామకం కోసం సెర్చ్ కమిటీలో వర్సిటీ నామినీ కోసం ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిర్వహించారు. వీసీ పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు పాలకమండలి సమావేశానికి దూరంగా ఉండాలని పేర్కొనడంతో వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్, వైవీయూ, ప్రొద్దుటూరు కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశానికి హాజరుకాలేదు. కాగా ఆంధ్రా విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులను నామినీగా నియమించినట్లు తెలిసింది.

వీసీని కలిసిన పాలకమండలి సభ్యులు

యోగివేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు విద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిశారు. ఉపకులపతిగా నియమితులయ్యాక తొలిసారిగా వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధిపై చర్చించారు.

కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పర్యటనపై కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వస్తున్న మంత్రి జితేంద్ర సింగ్ పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కేంద్ర మంత్రి పర్యటన కోసం హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్, వ్యవసాయం – అనుబంధ రంగాలు, ఆర్థిక రాబడులు – స్కిల్ డెవలప్‌మెంట్, కనీస మౌలిక సదుపాయాల కల్పన తదితర రంగాల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మంత్రి పర్యటన ఇలా..

కేంద్రమంత్రి జితేంద్రసింగ్ మూడురోజుల పాటు జిల్లాలో పర్యటిస్తారు. తొలిరోజు తిరుపతి నుంచి బయలుదేరి కడపకు చేరుకుని రాత్రి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. మరుసటిరోజు సీకే దిన్నె మండలం నాగిరెడ్డిపల్లెను సందర్శిస్తారు. అక్కడి విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రం, వాటర్ కన్జర్వేషన్ ప్లాన్ స్టాల్‌ను సందర్శిస్తారు. అనంతరం జమ్మలమడుగు మండలం మోరగుడికి వెళతారు. అక్కడ స్వయం సహాయక సంఘాలతో సమావేశమై వివిధ అంశాలను పరిశీలిస్తారు. రహదారులు, డ్రైయిన్స్, తాగునీరు, హౌసింగ్ వంటి గ్రామాభివృద్ధికి సంబంధించిన మౌలిక సదుపాయాలను పరిశీలిస్తారు. అనంతరం గండికోటను సందర్శిస్తారు. మరుసటిరోజు ఉదయం 10 గంటలకు కడప నుంచి బయలుదేరి తిరుపతి ఎయిర్‌పోర్టుకు వెళతారు.

రైతు ఆలోచనా విధానంలో మార్పు రావాలి

కడప సెవెన్‌రోడ్స్: వ్యవసాయంలో నవ శకానికి నాంది పలకాలంటే రైతు ఆలోచనా విధానంలో మార్పు రావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను ఫైనాన్స్ స్కేల్ ఫిక్సేషన్, ప్రతిపాదనలపై డిస్ట్రిక్ట్ లెవెల్ టెక్నికల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ సుస్థిర అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం డీసీసీబీ వారు ప్రచురించిన 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎల్‌డీఎం జనార్దన్, నాబార్డ్ ఏజీఎం విజయ్ విహారి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు: జిల్లా ప్రజలకు కలెక్టర్ శ్రీధర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తిరుపతి–షోలాపూర్ రైలు పొడిగింపు



కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి–షోలాపూర్–తిరుపతిల మధ్య వారాంతపు రైలును మరో మూడు నెలలపాటు పొడిగించారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 01437 నెంబరుగల రైలు ప్రతి గురువారం రాత్రి 9.40 గంటలకు షోలాపూర్‌లో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 7.45 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. అలాగే 01438 నెంబరుగల రైలు తిరుపతిలో ప్రతి శుక్రవారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు 11.50 గంటలకు షోలాపూర్ చేరుతుందన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మార్చి 28వ తేది వరకు అధికారులు పొడిగించారన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్‌రోడ్డు, యాదగిరి, వాడి, గుల్బర్గా, బీదర్, లాతూర్ స్టేషన్లలో ఆగుతుందని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ నేషనల్స్‌కు ఇర్ఫాన్



ఇర్ఫాన్

కడప స్పోర్ట్స్/ప్రొద్దుటూరు కల్చరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్–14 క్రికెట్ పోటీలకు జిల్లాకు చెందిన సికిలిగిరి సాద్ ఇర్ఫాన్ ఎంపికయ్యాడు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఈ యువ క్రికెటర్ నవంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించి చక్కటి ప్రతిభ కనబరచడంతో పాటు ప్రాబబుల్స్ మ్యాచ్‌ల్లో రాణించాడు. దీంతో జాతీయస్థాయి ఏపీ అండర్–14 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఓపెనింగ్ స్థానంలో ఆడే ఇర్ఫాన్ తన బ్యాటింగ్ టెక్నిక్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇతని ఎంపికపై క్రికెట్ ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రైవింగ్ సరదా

- ద్విచక్ర వాహనం తుక్కు తుక్కు
- మహిళకు గాయాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో మంగళవారం ఓ యువకుడి సరదా డ్రైవింగ్ కారణంగా ఓ పక్కకు నిలిపిన ద్విచక్ర వాహనం తుక్కు కావడంతో పాటు చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ గాయాల పాలైంది. వివరాల్లోకి వెళితే.. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మల్‌రెడ్డిపల్లికి చెందిన డ్రైవర్ గంగరాజు వ్యక్తిగత పనిమీద బొలేరో వాహనంతో మండలంలోని కందుకూరుకు వచ్చాడు. డ్రైవర్ నాగరాజు వాహనాన్ని పోస్టాఫీసు ఎదురుగా నిలిపి మూత్ర విసర్జన కోసం వెళ్లాడు. అయితే డ్రైవర్‌కు తోడుగా వచ్చిన బాబు అనే యువకుడు బొలేరో వాహనం ఎక్కి డ్రైవర్ సీట్లో కూర్చుని వాహనం నడిపేందుకు ఇంజిన్ స్టార్ట్ చేశాడు. అనంతరం గేర్లు, బ్రేకులు ఎలా ఉపయోగించాలో దిక్కు తోచక పోవడంతో వాహనం ముందుకు దూసుకుపోయింది. అప్పటికే అక్కడ ఓ పక్కన నిలిపిన పోస్ట్‌మాస్టర్ శివప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంటూ ముందుకు ఈడ్చుకెళ్లింది. అక్కడే శ్రీనివాస క్లినిక్ ఎదుట ఉన్న రేకులు దెబ్బతినగా క్లినిక్‌లో ఆరోగ్య పరీక్షల కోసం వచ్చిన ఓ మహిళ చేయి దెబ్బతినింది.

- కొత్త సంవత్సర వేడుకలకు వస్తూ ప్రమాదం
- డివైడర్‌ను ఢీకొన్న స్కార్పియో
- అక్కడికక్కడే ఒకరు, ఆసుపత్రిలో మరొకరు మృతి
- ఇంకొకరి పరిస్థితి విషమం


డివైడర్‌ను ఢీకొన్న స్కార్పియో

జమ్మలమడుగు/జమ్మలమడుగురూరల్ : ఏడాది చివరి రోజే వారి జీవితానికి ఆఖరు రోజు అవుతుందని అనుకోలేదు. అతివేగం వారి ప్రాణాలను హరించింది. సంఘటన స్థలంలోనే ఒకరు మరణించగా మరొకరు ప్రభుత్వాసుపత్రిలో మరణించారు. ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా..

ప్రాణం తీసిన అతివేగం


ప్రమాద స్థలంలో మరణించిన నందీష్


ఆసుపత్రిలో మరణించిన అబ్దుల్

పులివెందుల నియోజకవర్గంలోని వేముల, లింగాల, పులివెందుల ప్రాంతాలకు చెందిన ఏడుగురు స్నేహితులు జనవరి వేడుకలను నిర్వహించుకునేందుకు పర్యాటక కేంద్రమైన గండికోటకు పులివెందుల నుంచి బయలు దేరారు. వీరిలో లింగాల మండలం పెద్దకుడాల గ్రామానికి చెందిన అబ్దుల్, వేముల మండలం భూమయ్యగారిపల్లికి చెందిన నందీష్, పులివెందులకు చెందిన జగన్, షాహుల్, సింహాద్రిపురం అగ్రహారానికి చెందిన చైతన్య, షాజహాన్, ప్రేమ్ ఉన్నారు. ముద్దనూరు కొండ దిగిన తర్వాత చిటిమిటి చింతల గ్రామానికి సమీపంలో ఉన్న దర్గా మలుపు వద్దకు రాగానే వేగంగా వస్తున్న స్కార్పియోను అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొన్నారు. వేముల మండలం భూమయ్యగారిపల్లి గ్రామానికి చెందిన నందీష్(21) అక్కడికక్కడే మృతి చెందగా కొన ఊపిరితో ఉన్న లింగాల మండలం పెద్ద కుడాల గ్రామానికి చెందిన అబ్దుల్(25)ను జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తీసుకు రాగా చికిత్స పొందుతూ మరణించాడు. పులివెందులకు చెందిన జగన్ పరిస్థితి విషమించడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. చైతన్య, షాజహాన్, ప్రేమ్, షాహుల్ జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

పెన్నా నదిలో ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు


వంశీ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : గూడెంచెరువు గ్రామానికి చెందిన కూరపాటి వంశీ అనే యువకుడు పెన్నానదిలో ఈతకు వెళ్లి మంగళవారం మధ్యాహ్నం 1-15 సమయంలో గల్లంతయ్యాడు. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామం రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కూరపాటి వంశీ (22) మరో స్నేహితుడు కలసి పెన్నానదిలో ఈతకు వెళ్లారు. కాసేపటికి ఒక యువకుడు గట్టు మీదకు రాగా వంశీ బయటకు రాలేదు. దీంతో స్థానికులకు సమాచారం చెప్పడంతో వెంటనే పట్టణ పోలీస్ అధికారులకు, అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. మధ్నాహ్నం నుండి గజ ఈతగాళ్లను రప్పించి గాలించినా రాత్రి 8 గంటల వరకు ఆచూకీ లభించలేదు. తిరిగి బుధవారం గాలింపు చర్యలు చేపడతామని పోలీసు అధికారులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


ఆత్మహత్య చేసుకున్న విశ్వజిత్ సాహు

వేముల : మండలంలోని మబ్బుచింతలపల్లె గ్రామ సమీపంలోని తోటలో మంగళవారం తెల్లవారుజామున విశ్వజిత్ సాహు (25) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన విశ్వజిత్ సాహు తుమ్మలపల్లె సమీపంలో గల యురేనియం ప్రాజెక్టులోని ఎస్ఎంఎస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీకి వెళ్లకుండా సమీపంలోని తోటలో ఉరివేసుకుని మృతి చెందాడు. ఈ మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి తండ్రి విక్రమ్ కుమార్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. మృతుని తల్లిదండ్రులు తమ కుమారుడు ఉరివేసుకుని చనిపోయే వ్యక్తి కాదని, మృతిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని ఎస్ఐ తెలిపారు.



అనారోగ్యంతో నెమలి మృతి


నగరవనం వద్ద నెమలిని పడేసిన దృశ్యం

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో ఓ వ్యక్తి జాతీయ పక్షి నెమలిని పెంచుకుంటున్నాడు. నెమలికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఫారెస్ట్ అధికారులకు అప్పగించాడు. వారు లింగాల మండలంలోని పశువైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో నెమలిని పులివెందుల ఆస్పత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహబూబ్ బాషా పులివెందులలోని నగరవనం వద్ద నెమలిని పడేసి వెళ్లిపోయారు. విషయం ఫారెస్ట్ ఉన్నతాధికారులకు తెలియడంతో పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, ఈ విషయమై అటవీ శాఖ జిల్లా రేంజర్ అశోక్ కుమార్‌ను వివరణ కోరగా.. నెమలి మృతి చెందిన విషయం తన దృష్టికి వచ్చిందని, పోస్టుమార్టం నిర్వహించాక పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

డీఎస్పీలుగా పదోన్నతుల జాబితాలో 41 మంది సీఐలు

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా సీఐలుగా పనిచేస్తున్న 155 మందికి డీఎస్పీలుగా పదోన్నతులను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం జాబితా ప్యానెల్‌ను సిద్ధం చేసింది. కర్నూలు రేంజ్ పరిధిలో 41 మందికి పదోన్నతి లభించనుంది. త్వరలో అధికారికంగా పదోన్నతి జాబితా విడుదల కానుంది.

అండర్-12 క్రికెట్ చాంపియన్‌గా కడప జట్టు


అండర్-12 చాంపియన్‌గా నిలిచిన కడప జట్టు

కడప స్పోర్ట్స్ : తిరుపతి జిల్లా వెంకటగిరిలో డిసెంబర్ 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన అండర్-12 సీఎం లిటిల్ స్టార్ కప్ క్రికెట్ టోర్నమెంట్ చాంపియన్‌గా కడప జట్టు నిలిచింది. చెన్నై క్లబ్ నుంచి 4 జట్లు, నెల్లూరు నుంచి 2 జట్లు, వెంకటగిరి, కడప జట్లు తలపడిన ఈ టోర్నీలో కడప జట్టు విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. కడప జట్టు సెమీఫైనల్‌లో విరాట్ క్రికెట్ అకాడమీపై 74 పరుగులతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు జట్టుతో తలపడి 79 పరుగుల తేడాతో విజయం సాధించింది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన డి. ఎండీ తాహీర్‌ను ఉత్తమ బ్యాట్స్‌మన్‌,గా కె. అబుబకర్‌ను ఉత్తమ బౌలర్‌గా ఎంపిక చేశారు. జట్టు వెంట కోచ్ ఎస్. అబుబకర్, సీఏవైడీ జాయింట్ సెక్రటరీ ఎం. సాయిపృథ్వీ ఉన్నారు. జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలవడం పట్ల సీఏవైడీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, ఎ. రెడ్డిప్రసాద్‌లు అభినందనలు తెలిపారు.











జ్యోతిష్య రంగంలో తిరుగులేని సురేష్‌బాబు

కడప కల్చరల్ : జిల్లా జ్యోతిష్య రంగంలో సుపరిచితమైన పేరు సురేష్‌బాబు. కడప నగరానికి చెందిన ఆయన జ్యోతిష్య శాస్త్రంలో లోతులు తెలిసిన వారు ఆయన శాస్త్ర ప్రావీణ్యతను గమనించిన వారు ఆయనకు అభిమానులుగా మారారు. 24 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో జ్యోతిష్య పండితుడిగా సుపరిచితుడైన ఈయన ఆస్ట్రాలజీలోని పలు అంశాలపై పరిశోధనలు చేసి పట్టు సాధించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇతర దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు, సినీరంగ ప్రముఖులు సైతం ఆయన జ్యోతిష్యం పట్ల అపార విశ్వాసం కలిగి ఉండటం విశేషం. దీనికి తోడు సురేష్‌బాబు నిర్ణయించిన ముహూర్తానికి ప్రారంభమైన పలు సినీ ప్రముఖుల చిత్రాలు సూపర్‌హిట్ కావడంతో ఈయన వద్దకు జ్యోతిష్యం చెప్పించుకొనేందుకు పలువురు సినీ ప్రముఖులు తరలి వస్తున్నారు.

సమాజానికి తన వంతుగా..

కడప నగరానికి చెందిన సుదర్శనమ్మ, సుబ్బరాయుడు దంపతులకు జన్మించిన సురేష్‌బాబుకు చిన్నతనం నుంచే సేవా గుణం అలవడింది. తల్లి మరణానంతరం ఆమె జ్ఞాపకార్థం పలు క్రీడా పోటీలు నిర్వహించడం, చిన్నారులకు, అనాథలకు, రోగులకు, అభాగ్యులకు పండ్లు, బ్రెడ్లు, వస్త్రదానం, అన్నదానం చేస్తుంటారు. అలాగే తన పుట్టిన రోజునాడు, తన కుమార్తె, కుమారుడు పుట్టిన రోజుల్లో క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నారు.


భార్యాబిడ్డలతో సురేష్‌బాబు

ఆలస్య వివాహాలకూ.. పరిష్కారం

ఇటీవల కాలంలో సమాజంలో చోటు చేసుకుంటున్న ఆలస్య వివాహాలపై జ్యోతిష్య పరంగా శోధించి స్త్రీ, పురుషులకు ఎందుకు వివాహాలు ఆలస్యమవుతున్నాయని గుర్తించడంతోపాటు, వివాహమైన వారు సుఖమయ జీవనం గడపక పోవడం, విడాకుల వరకూ వెళ్లడం వంటి అంశాలపై పరిశోధన చేసి జ్యోతిష్యపరంగా పరిష్కారాలు కొనుగొని ప్రాజెక్టు రిపోర్టును రూపొందించి విశ్వవిద్యాలయ ఆచార్యులచే ప్రశంసలు అందుకున్నారు.

మనిషి ఆచరించే ప్రతి కర్మలోనూ జ్యోతిష్యం

పురాతన కాలం నుంచి నేటి వరకు నిలిచి ఉన్న విజ్ఞానశాస్త్రమే జ్యోతిష్యం. భారతీయ జీవనమంతా జ్యోతిష్యంతో ముడిపడి ఉంది. మనిషి ఆచరించే ప్రతి కర్మలోనూ, నిత్య విధుల్లోనూ వారికే తెలియని జ్యోతిష్య అంశాలున్నాయి. మానవుడు నిరంతరం అభివృద్ధి దిశలో పయనించేలా జ్యోతిష్యం చక్కటి మార్గం చూపుతుంది.

– ముద్దల. సురేష్‌బాబు, ఎంఏ(ఆస్ట్రాలజీ), కడప.















వరుణ్ వీరోచిత సెంచరీ

82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109 నాటౌట్

- తిలక్ వర్మ 99 అవుట్
- కర్ణాటకపై హైదరాబాద్ గెలుపు
- మయాంక్ అగర్వాల్ శతకం వృథా


వరుణ్

అహ్మదాబాద్: భారీ లక్ష్యం ముందున్నా... ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో కర్ణాటక జట్టుపై మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం అందుకుంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో హైదరాబాద్ రెండు బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని ఛేదించింది. వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 109 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ శతకంతో హైదరాబాద్ జట్టును గెలిపించాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 124; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో సెంచరీతో చెలరేగగా... స్మరణ్ (75 బంతుల్లో 83; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా... అనికేత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ముదస్సిర్, రోహిత్ రాయుడులకు ఒక్కో వికెట్ లభించింది. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (106 బంతుల్లో 99; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో శతకం చేజార్చుకోగా... వరుణ్ గౌడ్ వీరవిహారం చేశాడు. తిలక్, వరుణ్ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టారు. కీలక సమయంలో తిలక్ వెనుదిరిగినా... చివరి వరకు క్రీజులో నిలిచిన వరుణ్ గౌడ్ భారీ షాట్లతో విరుచుకుపడి జట్టును గెలిపించాడు. తనయ్ త్యాగరాజన్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ ఏడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. చివరి ఓవర్ తొలి బంతికి తనయ్ అవుటైనా... చామా మిలింద్ (4 నాటౌట్)తో కలిసి వరుణ్ హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దూబే, నికిన్ జోస్ చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తమ తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం పంజాబ్‌తో హైదరాబాద్ ఆడుతుంది.

వారెవ్వా వైశాలి



మహిళల విభాగంలో అగ్రస్థానంతో నాకౌట్‌కు అర్హత

- హంపి చేజారిన అవకాశం
- వరల్డ్ చెస్ 'బ్లిట్జ్' చాంపియన్‌షిప్

న్యూయార్క్: భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టోర్నీ తొలి రోజు మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ దశలో 11 గేమ్‌లలో కలిపి ఆమె మొత్తం 9.5 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. 8 గేమ్‌లు గెలిచిన వైశాలి 3 గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. తొలి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకొని 23 ఏళ్ల వైశాలి శుభారంభం చేసింది. ఐదో గేమ్‌లో ఆమెకు రష్యాకు చెందిన మాజీ బ్లిట్జ్ వరల్డ్ చాంపియన్ కేటరీనా లాగ్నోతో గట్టి పోటీ ఎదురైంది. హోరాహోరీ సమరం తర్వాత ఈ గేమ్ 'డ్రా'గా ముగిసింది. ఆ తర్వాత వైశాలి వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో గేమ్‌లలో విజయాలు సొంతం చేసుకుంది. ఎనిమిదో రౌండ్‌లో ప్రస్తుత వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ వలెంటినా గునీనా (రష్యా)పై గెలవడం ఆమె ముందంజ వేయడంలో కీలకంగా మారింది. 9వ రౌండ్‌ను 'డ్రా'గా ముగించుకున్న అనంతరం పదో గేమ్‌లో పాలినా షువలోవా (రష్యా)ను ఓడించడంతో వైశాలికి అగ్రస్థానం ఖాయమైంది. దాంతో అమెరికాకు చెందిన కారిసా ఇప్‌తో జరిగిన 11వ గేమ్‌ను చకచకా 9 ఎత్తుల్లోనే 'డ్రా' చేసుకొని వైశాలి క్వాలిఫయింగ్ దశలో నంబర్‌వన్‌గా నిలిచింది. మొత్తం 8 మంది ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్ (నాకౌట్) దశకు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్లో జు జినర్ (చైనా)తో వైశాలి తలపడుతుంది. మరోవైపు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి నాకౌట్‌కు చేరలేకపోయింది. 11 రౌండ్‌ల తర్వాత మొత్తం 8 పాయింట్లతో ఆమె 9వ స్థానంతో ముగించింది. 8 గేమ్‌లను గెలిచిన హంపి...మరో 3 గేమ్‌లలో పరాజయం పాలైంది. ఎనిమిదో రౌండ్‌లో మరో భారత ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ చేతిలో అనూహ్యంగా ఓడటం హంపి అవకాశాలను దెబ్బ తీసింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 18వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ (7 పాయింట్లు) 19వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక (7 పాయింట్లు) 22వ ర్యాంక్‌లో, నూతక్కి ప్రియాంక (5 పాయింట్లు) 70వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ (5 పాయింట్లు) 71వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి (4.5 పాయింట్లు) 76వ ర్యాంక్‌లో నిలిచారు. పాయింట్లు సమంగా ఉన్నపుడు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరిస్తారు.

అర్జున్‌కు నిరాశ...

పురుషుల (ఓపెన్) విభాగంలో భారత ఆటగాళ్లలో ఎవరూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మొత్తం 13 రౌండ్‌ల తర్వాత భారత్ నుంచి అత్యుత్తమంగా ఆర్.ప్రజ్ఞానంద 8.5 పాయింట్లతో 23వ స్థానంతో ముగించగా, రౌనక్ సాధ్వానికి 35వ స్థానం (8 పాయింట్లు) దక్కింది. తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి 7 పాయింట్లు మాత్రమే సాధించి 64వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి 5 గేమ్‌లలో గెలిచి అగ్రస్థానంతో ముందుకు దూసుకుపోయిన అర్జున్‌కు ఆ తర్వాత అనూహ్య ఫలితాలు ఎదురయ్యాయి. తర్వాతి 5 రౌండ్‌లలో 2 ఓడి, 2 'డ్రా' చేసుకున్న అతను ఒకటే గేమ్ గెలవగలిగాడు. ఆఖరి 3 రౌండ్‌లలో వరుసగా అనీశ్ గిరి (నెదర్లాండ్స్), డెనిస్ లజావిక్ (రష్యా), కజిబెక్ నొగర్‌బెక్ (కజకిస్తాన్)ల చేతుల్లో ఓడటంతో రేసులో అర్జున్ పూర్తిగా వెనుకబడిపోయాడు.

శ్రీకర్ భరత్, అశ్విన్ అజేయ సెంచరీలు


అశ్విన్ శ్రీకర్ భరత్

- మేఘాలయపై 10 వికెట్లతో ఆంధ్ర ఘనవిజయం
- 5 వికెట్లు పడగొట్టిన సందీప్
- విజయ్ హజారే ట్రోఫీ టోర్నీ


సందీప్

ముంబై: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్ర జట్టు నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఆంధ్ర 10 వికెట్ల తేడాతో మేఘాలయను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు 48.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిశాంత చక్రవర్తి (108 బంతుల్లో 101; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... అర్పిత్ (90 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. దీంతో ఒకదశలో మేఘాలయ జట్టు 182/1తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు విజృంభించి వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. దీంతో మేఘాలయ బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆంధ్ర బౌలర్లలో యారా సందీప్ 28 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... ఆంజనేయులు, మహీప్ కుమార్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర 29.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 228 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో విజృంభించాడు. మరో ఓపెనర్ అశ్విన్ హెబర్ (96 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) కూడా 'శత'క్కొట్టడంతో ఆంధ్ర జట్టు ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. మేఘాలయ బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న భరత్... సిక్స్‌లతో చెలరేగిపోతే అశ్విన్ బౌండరీలతో హోరెత్తించాడు. వీరిద్దరూ పోటీపడి పరుగులు రాబట్టడంతో లక్ష్యం చిన్నబోయింది. గత మ్యాచ్‌లో సర్వీసెస్‌పై అజేయ అర్ధశతకాలతో వికెట్ నష్టపోకుండానే జట్టును గెలిపించిన భరత్, అశ్విన్... ఈసారి కూడా దాన్ని పునరావృతం చేశారు. 5 వికెట్లు తీసిన సందీప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు 4 విజయాలు, ఒక పరాజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో కొనసాగుతోంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం మహారాష్ట్రతో ఆంధ్ర జట్టు తలపడుతుంది.

2025 స్పోర్ట్స్ క్యాలెండర్

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పశ్చిమ బెంగాల్ 33వసారి...

- సంతోష్ ట్రోఫీ టైటిల్ సొంతం
- ఫైనల్లో కేరళపై విజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీలో 33వసారి పశ్చిమ బెంగాల్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో హోరాహోరీగా సాగిన తుదిపోరులో పశ్చిమ బెంగాల్ జట్టు 1–0 గోల్ తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ తరపున రోబీ హన్స్‌దా (90+4వ నిమిషంలో) ఏకైక గోల్ చేసి జట్టుకు టైటిల్ అందించాడు. ఆదిత్య థాపా కొట్టిన హెడర్‌ను బాక్స్‌కు సమీపంలో అందుకున్న రోబీ... సునాయాసంగా ప్రత్యర్థి పోస్ట్‌లోకి పంపాడు. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు కేరళ జట్టు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గ్రూప్ దశలో అత్యుత్తమ ప్రదర్శనతో పరాజయం ఎరగకుండా ఫైనల్‌కు చేరిన ఇరుజట్ల మధ్య ఉత్కంఠ భరిత సమరం జరగగా... చివరకు పశ్చిమ బెంగాల్‌నే విజయం వరించింది.

సినిమా


ఎన్టీఆర్ ప్రభాస్ మహేశ్ బాబు

2024కి బై చెప్పి... 2025కి వెల్‌కమ్ చెప్పడానికి అందరూ సెలబ్రేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కొందరు స్టార్స్ అయితే కొత్త సంవత్సరం జరుపుకోవడానికి విదేశాలు వెళ్లారు. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో వెకేషన్ ప్లాన్ చేసుకునే అవకాశం ఈ స్టార్స్‌కి దక్కింది. వారి ఈ వెకేషన్ గురించి తెలుసుకుందాం...

విదేశాల్లో 2025


కుటుంబ సభ్యులతో ఎన్టీఆర్


సరిత, నయనతార, విఘ్నేశ్, మాధవన్

ఈ ఏడాది మహేశ్‌బాబు ఇప్పటికే రెండుసార్లు జర్మనీ వెళ్లొచ్చారు. అయితే ఇది హాలిడే ట్రిప్ కాదు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా జర్మనీ వెళ్లారని చెప్పుకోవచ్చు. అయితే ప్రతి ఏడాది మహేశ్‌బాబు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఫారిన్‌లో జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా ఫారిన్‌లోనే మహేశ్‌బాబు ప్లాన్ చేశారని సమాచారం. మహేశ్‌బాబు మోస్ట్‌లీ యూరప్‌కు వెళ్లనున్నారట.

ఇక ప్రభాస్ ఆల్రెడీ యూరప్‌లో ఉన్నారని తెలిసింది. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణలో భాగంగా ప్రభాస్ కాలికి గాయమైంది. వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. యూరప్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారని, ప్రభాస్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే అని టాక్. విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్, ఫౌజి' చిత్రీకరణలో పాల్గొంటారు ప్రభాస్. ఈ సినిమాల చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రాన్ని ఆరంభిస్తారు ప్రభాస్. ఇక 'దేవర' సక్సెస్ జోష్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఎన్టీఆర్ హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్ 'వార్ 2' (ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో) లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు చెందిన ఓ లెంగ్తీ షూట్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత ఫ్యామిలీతో కలిసి లండన్ వెళ్లారని తెలిసింది. సో... ఎన్టీఆర్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లండన్‌లోనే అని ఊహించవచ్చు. లండన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌తో ఎన్టీఆర్ బిజీ అవుతారట. ఇంకా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం హీరోయిన్ పూజా హెగ్డే స్పెయిన్ వెళ్లారు. రష్మికా మందన్నా ఆల్రెడీ ఫారిన్‌లోనే ఉన్నారని తెలిసింది. హీరోయిన్ తమన్నా, ఫరియా అబ్దుల్లా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను అమెరికాలో ప్లాన్ చేశారని తెలిసింది. వీరితో పాటు మరి కొందరు టాలీవుడ్ యాక్టర్స్ గోవా, మాల్దీవ్స్‌లో వేడుకలు ప్లాన్ చేశారని సమాచారం.

భర్త విఘ్నేష్ శివన్‌తో నయనతార దుబాయ్ వెళ్లారు. అక్కడే మాధవన్, ఆయన భార్య సరిత కూడా ఉన్నారు. సో... ఈ రెండు ఫ్యామిలీస్ ఒకే చోట వేడుక చేసుకోనున్నారు. కలిసి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. అలాగే బాలీవుడ్ స్టార్ట్ హీరో హృతిక్ రోషన్ కూడా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ స్పాట్‌గా దుబాయ్‌నే ఎంచుకున్నారు. ఇంకా ఫ్యామిలీతో కలిసి దియా మీర్జా శ్రీలంక వెళ్లారు. అర్జున్ రాంపాల్ సెలబ్రేషన్స్ గోవాలో జరుతాయని సమాచారం. ఫ్యామిలీతో కలిసి కరీనా కపూర్ స్విట్జర్లాండ్‌లో, శిల్పాశెట్టి లండన్‌లో, భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి హీరోయిన్ సోనాక్షీ సిన్హా ఆస్ట్రేలియాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకోనున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ దిమ్రీ ఫిన్‌ల్యాండ్ వెళ్లారు.

గుండె జారిపోయిందే!


వరుణ్ రాజ్, మమత

వరుణ్ రాజ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'పోకిరి'. వికాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత హీరోయిన్. ప్రమోద్ రాజు సమర్పణలో రాజా మూవీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా వరుణ్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా 'పోకిరి' నుంచి 'గుండె జారిపోయిందే..'. అంటూ సాగే మొదటి పాటని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో–నిర్మాత వరుణ్ రాజ్ మాట్లాడుతూ– ''పోకిరి' టైటిల్‌లోనే దమ్ముంది. ఈ సినిమాతో హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. 'పోకిరి' సినిమాకి ఓనర్ మహేశ్‌బాబుగారే. మేమంతా ఆయన అభిమానులం అంతే'' అన్నారు. ''ఈ మూవీ స్టోరీ లైన్ రాసుకున్నప్పటి నుంచి 'పోకిరి' అనే టైటిల్ అనుకున్నాం'' అని వికాస్ చెప్పారు. ''పోకిరి' నా తొలి సినిమా'' అని పేర్కొన్నారు మమత. సంగీత దర్శకుడు ఉదయ్ కిరణ్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకీ–వంశీ.

ఓ వెన్నెల...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరోయిన్. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ఈ నెల 3న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'భైరవం' మూవీ నుంచి 'ఓ వెన్నెల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి'' అని చిత్రబృందం పేర్కొంది.


సాయి శ్రీనివాస్, అదితీ శంకర్

2024ని మంచి సినిమాతో ముగించాను

– జాన్వీ కపూర్



''అమరన్' సినిమాని కాస్త ఆలస్యంగా చూశాను. అయితే 2024 సంవత్సరాన్ని ఇలాంటి ఒక అద్భుతమైన, ఒక మంచి సినిమా చూసి ముగించినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని హీరోయిన్ జాన్వీ కపూర్ అన్నారు. శివ కార్తికేయన్, సాయిపల్లవి జోడీగా నటించిన ద్విభాషా చిత్రం (తమిళ్, తెలుగు) 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. 2014లో జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దీపావళి కానుకగా 2024 అక్టోబరు 31న విడుదలైంది. ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. ఈ చిత్రంపై ఇప్పటికే ఎంతోమంది స్టార్స్ కూడా ప్రశంసలు కురిపించారు. తాజాగా జాన్వీ కపూర్ కూడా 'అమరన్' మూవీపై తన ఇన్‌స్టాగామ్ ద్వారా ప్రశంసలు కురిపించారు. ''అమరన్' సినిమాని నేను చూడడం ఆలస్యమైంది. కానీ, ఎంతో అద్భుతమైన సినిమా. ప్రతి సన్నివేశం చాలా భావోద్వేగంతో నిండిపోయింది. ఈ ఏడాదికి 'అమరన్' బెస్ట్ మూవీ. ఈ చిత్రం నా హృదయాన్ని కదిలించింది. ఈ సినిమాలోని సన్నివేశాలు నా హృదయాన్ని బరువెక్కించాయి. ఓ ప్రేక్షకురాలిగా 2024ని ఇలాంటి ఒక మంచి సినిమాతో ముగించడం సంతోషంగా ఉంది'' అని పోస్ట్ చేశారామె. కాగా ఎన్టీఆర్ 'దేవర' మూవీతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం రామ్‌చరణ్‌కి జోడీగా నటిస్తున్నారు.

ఓటీటీ **ఇది చూడొచ్చు**

సీక్రెట్స్ ఆఫ్ ఆర్ఆర్ఆర్ బై రాజమౌళి

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ఆర్ఆర్ఆర్ - బిహైండ్ అండ్ బియాండ్ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.



తన ఉనికిని తెలిపేందుకు ఓ గదిలో నలుగురు ముందు చప్పట్లు కొడితే ఆ నలుగురికి తన విషయం తెలియవచ్చు. కానీ అదే ఉనికి ప్రపంచానికి తెలియాలంటే సరిగ్గా రాజమౌళిలా ఆలోచించాలి. భారత దేశానికి ఒకప్పుడు సినిమా ప్రమోషన్‌ను ఓ వినూత్న పంథాలో పరిచయం చేసిన బాలీవుడ్ దిగ్గజం అమిర్ ఖాన్ కూడా తాను ఈ విషయంలో రాజమౌళినే ఫాలో అవుతాననడం దీనికి ఓ నిదర్శనం. చరిత్ర అనేది రాజమౌళి ముందు ఉన్నది తరువాత ఉంటుంది, కానీ ఆ చరిత్రలో రాజమౌళికి ఓ చెరగని పేజీ ఉంటుందనేది మాత్రం నిర్వివాదాంశం. తెలుగు సినిమా వైభవాన్ని ఎన్నో అంతర్జాతీయ వేదికలపైన నిలిపిన శిల్పి రాజమౌళి. మరీ ముఖ్యంగా తెలుగు సినిమాకి ఆస్కారమే లేదన్న ఆస్కార్ పురస్కారాన్ని అద్భుతంగా అందించిన అత్యున్నత దర్శకులు రాజమౌళి. తన సినిమా అంటేనే ఓ సంచలనం. మరి... ఆ సంచలనం వెనకున్న సీక్రెట్ తెలుసుకోవాలని ప్రతి దర్శకుడితో పాటు సామాన్య ప్రేక్షకుడికి కూడా ఆసక్తి ఉంటుంది. ఆ కోవలోనే రాజమౌళి తీసిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకి సంబంధించిన తన కష్టాన్ని ఓ చక్కటి డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంచారు. దాదాపు రెండున్నర గంటల పై నిడివి ఉన్న 'ఆర్ఆర్ఆర్' సినిమాను నాలుగేళ్ల పాటు తీశారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా మొత్తాన్ని ఎలా తీశారో రాజమౌళి వ్యాఖ్యానంతో పాటు సినిమాలోని నటీనటులు టెక్నీషియన్స్ కూడా వివరిస్తూ చూపించడం ఎంతో బాగుంది. తన ఈ 'ఆర్ఆర్ఆర్' ప్రయాణానికి సంబంధించి ఎన్నో తెలియని, చూడని అద్భుత విషయాలను ప్రేక్షకులకు అందంగా అందించారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి... ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ఫుటేజ్ కొన్ని గంటల రూపంలో ఉంటే దానిని ఎడిట్ చేసి, గంటన్నర నిడివితో అందించారట. ఈ సమాజమనేది ఓ సృష్టి. ప్రతిరోజూ మన మనుగడ ఈ సృష్టికి అనుగుణంగానే ఉంటుంది. ఓ రకంగా సినిమా అన్నది కూడా ఓ సృష్టే. ఓ దర్శకుడి ఆలోచనకు ప్రతిరూపమే సినిమా అన్న ఓ అద్భుత సృష్టి. కానీ ఈ సినిమా సృష్టిలో ఎంతోమంది కష్టం ఉంటుంది. మరి... అటువంటి సినిమాను ఏ విధంగా రూపొందించారో ఆ రహస్యాలు మీరు కూడా తెలుసుకోవాలంటే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్'ని చూసేయండి. వర్త్ టు వాచ్ అండ్ ప్రిజర్వ్ ద డాక్యుమెంటరీ ఫర్ ది ఫ్యూచర్ కిడ్స్.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.